క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

● హాజరుకానున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

కనిగిరి రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని దిరిశవంచ ఎంపీటీసీ వట్టివేళ్ల రంగమ్మ, ఆమె కుమారుడు దేవాంగుల సంక్షేమ సంఘం నాయకుడు వట్టి వేళ్ల రంగబాబు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. మండలంలోని యడవల్లి, ఎర్ర ఓబనపల్లి గ్రామాల్లోని బీసీ, ఎస్సీ కాలనీల్లో పేదలకు, వృద్ధులకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రసాద్‌రెడ్డి, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్యశిబిరంను ప్రారంభిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ముబారక్ హిజామా సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ అనుభవం కల్గిన హైదరాబాద్‌కు చెందిన ఓమర్ సాహెబ్ బృందం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ టీ వెంకటరెడ్డి, మౌలానా అబ్దుల్ కలాం, ఎస్‌కే సద్దాం, ఎస్‌కే రబ్బాని, సమద్, నిర్వాహకులు ఎస్‌కే ఖాశింసా(ముబారక్), మదర్ థెరిస్సా సేవా సమితి అధ్యక్షులు ఎస్ఎస్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



గుడ్లూరులో ఆసక్తిగా సాగిన ఎడ్లపోటీలు

గుడ్లూరు: కనుమ పండగ సందర్భంగా మంగళవారం మండల కేంద్రమైన గుడ్లూరులో నిర్వహించిన ఎడ్ల పందేల పోటీలు ఆకట్టుకున్నాయి. రెడ్డిపాలెం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఆసక్తిగా సాగిన ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ. 20 వేలు సాదినేని ప్రదీప్ ఎడ్ల జత, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు కర్పూరపు శ్రీనివాసులు ఎడ్లు, తృతీయ బహుమతి రూ. 10 వేలను రామాల దివాకర్ రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. విజేతలుగా నిలిచిన వారికి యూత్‌ఫోర్స్ కార్యనిర్వాహకులు నగదు బహుమతులు అందచేశారు.

అన్నప్రసాద భవనానికి భారీ విరాళం



విరాళం అందిస్తున్న సంస్కృతి స్కూల్ అధినేత చంద్రశేఖర్

కందుకూరు: కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వాముల అన్నప్రసాద వితరణ భవనానికి పట్టణంలోని సంస్కృతి స్కూల్ యాజమాన్యం భారీ విరాళం అందజేశారు. పట్టణంలోని గుర్రంవారిపాలెంలో నిర్వహిస్తున్న సంస్కృతి స్కూల్ చైర్మన్ కొంకా చంద్రశేఖర్ రూ. 2,00,016ల విరాళాన్ని అయ్యప్పస్వామి సేవా సమితి సభ్యులకు అందజేశారు. సమితి సభ్యులు మాట్లాడుతూ సంస్కృతి స్కూల్ తరఫున భారీ విరాళం అందజేసిన చంద్రశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కె.ఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకట నరసింహం, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

సంబరాల సంక్రాంతి



టంగుటూరులో బహుమతులు అందిస్తున్న ఆదిమూలపు సురేష్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



పామూరులో వాసవి ఆలయం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు

టంగుటూరు: టంగుటూరు మండలంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. టంగుటూరు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఆటల పోటీలు నిర్వహించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రావూరి అయ్యవారయ్య మెమోరియల్ వారి సహకారంతో రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ పోటీలు నిర్వహించగా మొదటి బహుమతి రూ. 30 వేలను ప్రకాశం జట్టు, రెండో బహుమతి రూ.20 వేలను నవకాంత్ ఎన్ ఎక్స్‌టీం, మూడో బహుమతి రూ.10 వేలను నెల్లూరు వీబీపీ బాయ్స్ టీం, నాలుగో బహుమతిని వజ్జిరెడ్డిపాలెం, ఐదో బహుమతి విజయనగరం జిల్లా జట్టు గెలుపొందాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, చిడిపోతు సుబ్బారావు, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, సొసైటీ అధ్యక్షుడు రావూరి ప్రవీణ్‌కుమార్, ఆడుదాం ఆంధ్ర జిల్లా అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్, ఎంపీటీసీలు కొమ్ము ప్రభుదాసు, శిఖా నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడు రోజులుగా వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు మంత్రి ఆదిమూలపు సురేష్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, ఏలూరి వంశీ, వేజండ్ల సుబ్బారాయుడు, పరిటాల చక్రపాణి, ముప్పరాజు వెంకట్రావు, బీమవరపు అంకయ్య, రాయుండ్ల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, సద్భావనతో మెలగాలి

కొండపి(సింగరాయకొండ): ప్రతి ఒక్కరు ప్రేమ, సద్భావనతో మెలగాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. కొండపి మండలం అనకర్లపూడి గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యే ప్రార్థనలు చేశారు.

అట్టహాసంగా ముగ్గుల పోటీలు

మర్రిపూడి(సింగరాయకొండ): మర్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో సోమవారం స్పేస్ విజన్ గ్రూప్ అధినేత తూమాటి వెంకట నరసింహారెడ్డి సహకారంతో ఎంపీపీ వాకా వెంకట రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పొదిలి, మర్రిపూడి మండలాల మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కనిగిరి రూరల్: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలతో మూడు రోజులు పల్లె సీమలు కళకళలాడాయి. కొత్త బంధువుల రాకతో ఇళ్లలో ఆనంద హేల నెలకొంది. పల్లె సీమల్లో గ్రామీణ క్రీడలు, ఆటలతో సందడి నెలకొంది. కుర్ర కారు, యువత పండగ సంబరాల్లో ఉత్సాహంగా గడిపారు. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సోమ, మంగళవారాల్లో స్థానిక వైఎస్సార్ భవన్‌లో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ఎమ్మెల్యేను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పామూరు: సంక్రాంతి పండుగ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక కందుకూరు రోడ్డులోని ఆక్సిజన్ సిటీ లేఅవుట్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటలపోటీలు రన్నింగ్, మ్యూజికల్‌ఛైర్స్, పాటల పోటీలు, బెలూన్స్, స్కిప్పింగ్, సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా స్వయంసంవృద్ధి సాధించిన నాడే ప్రతి ఇంట నిజమైన సంక్రాంతి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల, మహిళల పక్షపాతి అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అమలు చేసి లక్షల కోట్లరూపాయల ప్రజల ఖాతాల్లో జమ చేశారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, కోఆప్షన్ నాయబ్‌రసూల్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ షేక్.ఖాదర్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ షేక్.అబ్దుల్, ఏయంసీ మాజీ వైస్ చైర్మన్ దరిశి రాము, కనమర్లపూడి లక్ష్మీమోహన్, మంచికంటి మధు, కొత్తూరి రవి, దరిశి సుబ్రమణ్యం, పబ్బతి సూరి, గాజులపల్లి శ్రీనివాసరెడ్డి, సలీం, ఎంఏటీ నాయబ్, మహిళలు పాల్గొన్నారు.

పామూరు: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, జనవిజ్ఞానవేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అన్నారు. సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంవద్ద వాసవీక్లబ్స్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం మండల అధ్యక్షుడు యేల్చూరి బాలకొండలు అధ్యక్షతన ముగ్గులపోటీలు, మ్యూజికల్ ఛైర్స్ నిర్వహించారు. అదేవిధంగా డి.వి.పాలెంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను ఏఎంసీ వైస్ చైర్మన్ చాంద్‌బాషా, జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెన్నకృష్ణలు అందజేశారు.

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యువత ఆటల పోటీలు, మహిళలు ముగ్గులు పోటీల్లో ఉత్సాహంగా గడిపారు. మండలంలోని అయ్యలూరివారిపల్లె శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి వారికి భక్తులు కె.శ్రీనివాసరెడ్డి, సుభాషిణి, ఆదిలక్ష్మమ్మలు వెండి అభయహస్తం, పాదుకలు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



విశిష్ట అలంకరణలో తిరుమలనాథస్వామి



జరుగుమల్లి : పైడిపాడులో లక్ష్మీనారాయణ స్వామి తెప్పోత్సవం



టంగుటూరు : జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములవారు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు



కనిగిరిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

టంగుటూరు/పొన్నలూరు/జరుగుమల్లి: సంక్రాంతి సంబరాలను కొండపి నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో చిన్నారులు, యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

టంగుటూరు మండలం వల్లూరులో ప్రసిద్ధి గాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. జములపాలెం గ్రామంలో సీతారామస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి తెప్పోత్సవం

జరుగుమల్లి మండలంని పైడిపాడు గ్రామంలో లక్ష్మీ నారాయణస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ అర్చకుడు అరుణ్ చక్రవర్తి ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ స్వామివారిని ఊరేగించిన అనంతరం నాగమ్మ కుంటలో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ రజనీకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ గొర్రెపాటి నరసింహారావు, మాజీ చైర్మన్ కాటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

కందుకూరు రూరల్: మండలంలోని సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా ఇళ్లల్లో పాల పొంగళ్లు పెట్టుకొని దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి బంధువులతో పాటు స్వగ్రామాలకు వచ్చిన వారు, కొత్త అల్లుళ్లతో గ్రామీణ ప్రాంతాలు కళకళలాడాయి. కొండికందుకూరు పంచాయతీలోని గౌతమ్ నగర్‌లో యువత మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా సంక్రాతి సంబరాలు

కందుకూరు: నియోజకవర్గంలో పెద్ద పండుగ సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి వేడుకలను, మంగళవారం కనుమ వేడుకలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. పట్టణంతో పాటు, పరిసర గ్రామాల్లోని ప్రజలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి సందడి చేశారు. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు వంటి నగరాల నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారవేత్తలు గ్రామాలకు చేరుకున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి పండుగకు పెద్ద ఎత్తున ఉపాధి కోసం వలస వెళ్లిన వారు గ్రామాలకు వచ్చారు. గ్రామాల్లో బంధుమిత్రులతో కలిసి పండుగను జరుపుకునేందుకు ప్రధాన్యతను ఇచ్చారు. దీంతో కందుకూరు పట్టణంలో వాహన రాకపోకలతో అత్యంత రద్దీగా మారాయి. రెస్టారెంట్‌లు, సినిమా హాళ్లు, హోటల్స్, వస్త్ర దుకాణాలు, చిల్లర దుకాణాలు వంటి వ్యాపారాలకు పండుగ అదనపు ఆదాయం తెచ్చిపెట్టింది.

కన్నుల పండువగా పార్వేట ఉత్సవం

కనుమ పండగ సందర్భంగా స్థానిక అంకమ్మతల్లి ఆలయం వద్ద నిర్వహించే పార్వేట ఉత్సవం మంగళవారం రాత్రి కన్నుల పండుగగా సాగింది. పట్టణంలోని ప్రముఖ దేవాలయాల నుంచి దేవతామూర్తులు ఊరేగింపుగా అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణానికి చేరుకుని భక్తులకు దర్శనం ఇవ్వడం ఆనవాయితీ. దీనిని పార్వేట ఉత్సవం అంటారు. పెద్దబజార్ నుంచి శ్రీరామమూర్తి, వాసవీఅమ్మవారు, గణనాథుడు, శివాలయం నుంచి శివపార్వతులు, జనార్ధన స్వామి దేవాలయం నుంచి జనార్దన స్వామి, దుర్గమ్మ దేవాలయం నుంచి దుర్గమ్మ ఇలా అన్ని ప్రాంతాల నుంచి దేవతా మూర్తులు తరలివచ్చి భక్తులు దర్శనమిచ్చారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



పొందూరు కార్యక్రమంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న మహిళలు



కందుకూరు: పార్వేట ఉత్సవంలో భాగంగా కొలువైన దేవతామూర్తులు



కందుకూరు: శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



కొండికందుకూరు గౌతమ్ నగర్‌లో ముగ్గుల మొదటి బహుమతి అందజేస్తున్న దృశ్యం

జూదరుల అరెస్ట్

కందుకూరు రూరల్: పేకాట, కోడి పందేల స్థావరాలపై దాడి చేసి 29 మందిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై తిరుపతయ్య తెలిపారు. మండలంలోని విక్కిరాలపేట గ్రామంలో పేకాటాడుతున్న స్థావరంపై దాడి చేసి పది మందిని, వారి వద్ద నుంచి రూ.9,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పలుకూరు గ్రామంలో కోడి పందెం నిర్వహిస్తున్న ఐదుగురిని, మూడు కోళ్లను, రూ.1170 స్వాధీనం చేకున్నారు. ఇదే గ్రామంలో పేకాటాడుతున్న నలుగురిని, రూ.33,130ను, కందుకూరు పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిని, రెండు కోళ్లను, రూ.7610ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడ్లూరు: కోడి పందేలు, పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి ఎనిమిది మంది జూదరులను, నాలుగు కోళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పెదలాటరఫిలో కోడి పందెలు వేస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని నాలుగు కోళ్లను, రూ.400 స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాళ్లపాడులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.700ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.



వలేటివారిపాలెం: జూదరులతో పోలీస్ సిబ్బంది

వలేటివారిపాలెం: మండలంలోని శాఖవరం గ్రామ శివారులో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వలేటివారిపాలెం ఎస్సై మహేంద్ర నాయక్ , లింగసముద్రం ఎస్సై బాజీ బాబు సంయుక్తంగా వారి సిబ్బందితో పేకాట ఆడుతున్న శిబిరం సోమవారం దాడి చేసి 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,90,670 నగదును స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కనిగిరి రూరల్: వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..కనిగిరి నుంచి పామూరు వైపు వెళ్తున్న గ్రానైట్ రాళ్ల లారీ.. బీఎస్ఎన్ఎల్ ఆఫీసు పక్కన ఖాళీ స్థలంలో ఉన్న బోర్ నుంచి వాటర్ పట్టుకుని ప్రధాన రోడ్డు ఎక్కుతున్న వాటర్ ట్యాంక్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో జరిగిన ఈ దుర్ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ వల్లపు కిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె.మాధవరావు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పీసీపల్లి: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.కోటయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని బట్టుపల్లి గ్రామంలో సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకొని గ్రామంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడిపందేలు ఆడుతున్న జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2,250, రెండు కోళ్లను స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పేకాట, కోడిపందాలు, జూదం ఆడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను ఎస్సై కోరారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేత




ప్రోత్సాహక నగదును అందచేస్తున్న సమితి నాయకులు

కనిగిరి రూరల్: మారెళ్ల ప్రసాద్‌రావు స్మారక ప్రతిభా పురస్కారాలను మంగళవారం మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లిలో అందచేశారు. పదో తరగతిలో ఉన్నత ప్రతిభ చాటిన గ్రామ విద్యార్థినులకు బొమ్మిరెడ్డిపల్లి గ్రామ అభ్యుదయ సమితి ప్రతినిధులు బొల్లా సురేష్, బొల్లా నారాయణస్వామి, పాలూరి హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన మూలే సుస్మితకు రూ.10వేలు, తూము కీర్తికి రూ 5. వేలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శ్రీరామ్ మురళీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అభ్యుదయ సమితి సభ్యులు, ఉపాధ్యాయులు గంటా వెంకట్‌రెడ్డి, తిరుమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

కనిగిరి రూరల్: విజయవాడలో ఈ నెల 19న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, సమతా సభ కార్యక్రమానికి కనిగిరిలోని అన్ని గ్రామాల నుంచి దళిత, బడుగు బలహీన వర్గాల ప్రజలు, అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎంపీపీ దంతులూరి ప్రకాశం పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సామాజిక న్యాయ మహా శిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న ఆవిష్కరిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయవాడ నడిబొడ్డులోని స్వరాజ్ మైదానంలో సుమారు రూ.400 కోట్లతో 125 అడుగుల విగ్రహాన్ని, అంబేడ్కర్ స్మృతివనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలిరండి



టంగుటూరు: విజయవాడలో ఈ నెల 19న అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి వేలాదిగా తరలిరావాలని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జోన్ 5 ఇన్‌చార్జి, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల రామారావు పిలుపునిచ్చారు. టంగుటూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. 400 కోట్లు ఖర్చు పెట్టి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.